సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ❘ 14 ❘ జనవరి ❘ 2023



లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

ప్రైవేట్ వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ పెంచలయ్య హెచ్చరించారు. - IIలో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,220
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,200
3 శాతం జీఎస్టీతో	రూ.5,356
సవర (8 గ్రా)	రూ.42,848

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3 /21.0

జిల్లా వ్యాప్తంగా శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. చలి తీవ్రత పెరిగింది. గాలిలో తేమ 52 శాతం ఉంది.

న్యూస్‌రీల్

భారీగా జిప్సం దిగుమతి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నంపోర్టు ద్వారా భారీగా జిప్సం దిగుమతి జరుగుతున్నట్లు పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు శుక్రవారం తెలిపారు. కై లా ఫార్చ్యూన్ అనే నౌక ద్వారా 1,58,950 టన్నుల జిప్సం దిగుమతి చేస్తున్నారు. ఆన్యా అనే నౌక ద్వారా భారీస్థాయిలో ఇనుప ఖనిజం ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 1.65 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఎగుమతి చేయనున్నారు.

కలెక్టరేట్ స్పందన రద్దు

నెల్లూరు (అర్బన్): కనుమ పండగ రోజు సోమవారం సెలవు కావడంతో నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగే ప్రజావిజ్ఞప్తుల దినం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వ్యయ, ప్రయాసాలు భరించి కలెక్టరేట్‌కు రావద్దని తెలిపారు.

రేపు నిమ్మమార్కెట్ యార్డుకు సెలవు

పొదలకూరు: పట్టణంలోని నిమ్మ మార్కెట్ యార్డుకు సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం సెలవు ప్రకటించినట్లు శుక్రవారం నిమ్మ మార్కెట్ అసోసియేషన్ ట్రెజరర్ మెంతెం బాలకృష్టారెడ్డి తెలిపారు. రైతులు భోగి పండగ నాడు తోటల్లో కాయలు కోయొద్దన్నారు. సంక్రాంతి రోజున కాయలు కోస్తే కనుమ రోజు అంటే సోమవారం మార్కెట్‌కు తరలించవచ్చునన్నారు. కనుమ పండగ నాడు మార్కెట్ యథావిధిగా ఉంటుందని చెప్పారు.

జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో ఎవరైనా పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ విజయారావు హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో కోడి పందేలు, జూదం నిషేధించామన్నారు. ప్రత్యేక బృందాల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. పట్టుబడితే తీవ్రమైన కేసులు నమోదు చేయాలని ఇప్పటికే పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా 100కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందించడంలో ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లా ప్రజలందరూ సంప్రదాయ క్రీడల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సోమశిలలో 71.753 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం నాటికి 71.753 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 3,649 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది.

కల్యాణమస్తు'ను సద్వినియోగం చేసుకునేలా కృషి

• డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని



కొడవలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు పథకాన్ని వీలైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని సూచించారు. నార్తురాజుపాళెం 1, 2 సచివాలయాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కల్యాణమస్తు బృహత్తర పథకమన్నారు. ఈ పథకం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వివాహాలు చేసుకుంటే ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు సహాయం అందిస్తుందన్నారు. ఈ పథకంపై అవగాహన కల్పించడం ద్వారానే ఎక్కువ మంది సద్వినియోగం చేసుకుంటారన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం ముఖ్యమన్నారు. ఉదయం 10.30 గంటల్లోపు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. సచివాలయ సేవలను మరింత పెంచడంతో పాటు సర్వీసుల ద్వారా వచ్చే నగదును ఎప్పటికప్పుడు బ్యాంక్‌లో జమ చేయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ఉవ్వెత్తున భోగి మంట



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న నెల్లూరు సండే మార్కెట్ వీధి



మైపాడుగేట్ సెంటర్‌లో నవాబుపేట మిత్రమండలి ఏర్పాటు చేసిన భోగి మంట

సింహపురిలో సంక్రాంతులు

• పల్లె, పట్టణాల్లో మూడు రోజుల పండగ శోభ • నేడు భోగి పండగ • రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ

తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు పండగ సంక్రాంతి. మూడు రోజులు వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ సందేశం, స్ఫూర్తితో జరుపుకునే పండగలు. వేగంగా జీవన ప్రమాణాలు, కాలాలు మారుతున్నా.. సంక్రాంతుల శోభ మాత్రం నేటి తరానికి పదిలంగానే ఉంది. పల్లెల్లో పిండి వంటల ఘుమఘుమలు. సంస్కృతి సంప్రదాయాలను స్వాగతిస్తూ రంగురంగుల రంగవల్లులతో తీర్చిదిద్దుతున్న లోగిళ్లలో సంక్రాంతి కళ ఉట్టిపడుతోంది.





స్వీట్స్ షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉంచి అరిసెలు, వివిధ రకాల మనుబూలు

నెల్లూరు (బృందావనం): సంక్రాంతి పండగతో సింహపురి సీమ సరికొత్త శోభను సంతరించుకుంది. చిన్నారుల ఆట, పాటలు, యువతీ, యువకులకు క్రీడాపోటీలు, ఎద్దులు, కోడిపందేల కోలాహలం, దూరప్రాంతాల నుంచి స్వగృహాలకు తరలివచ్చిన కుటుంబ సభ్యులతో పల్లెలు సందడిగా మారాయి. మూడు రోజులు ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోనున్న సంక్రాంతి సంబరాల కోసం తెలుగు వారందరూ సమాయత్తమయ్యారు. తొలి రోజు శనివారం భోగి పండగను జరుపుకునేందుకు శుక్రవారం ఉదయం నుంచే తాటాకులను కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా దుస్తులను, పండగ సామగ్రిని, పూలు కొనుగోలు చేసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలతో నగరంలోని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, సండేమార్కెట్, చిన్నబజారు, పెద్దబజారు, మాగుంటలేఅవుట్, స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతాల్లోని షాపింగ్ మాల్స్, వస్త్రాల దుకాణాలు, పూల అంగళ్లు కిటకిటలాడుతున్నాయి. పల్లెల నుంచి పట్టణాల నుంచి తరలివచ్చిన ప్రజానీకంతో నగరంలోని ప్రధాన కూడళ్లు రద్దీగా మారాయి. నగరంలోని ఆర్టీసీ బస్, రైల్వేస్టేషన్లు రాకపోకలు సాగించే ప్రయాణికులతోసందడిగా మారాయి. తమ పాడి పంట సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ దేవతల రూపాలుగా భావించే పశువులను పూజించే కనుమ పండగను సోమవారం జరుపుకోనున్నారు.

కోలాహలంగా భోగి

సంక్రాంతిలో భాగంగా తొలి రోజు శనివారం వేకువ జామున భోగి పండగను ఇంటిల్లిపాది వేడుకగా జరుపుకున్నారు. సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ యువతులు, మహిళలు తమ ఇంటి ముంగిళ్లను రంగురంగుల రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఇంటిలోని పాతసామానులతో పాటు, కొనుగోలు చేసిన తాటాకులను, కలపను, నిరుపయోగంగా ఉండే చెత్తాచెదారాన్ని అగ్ని దేవుడికి ఆహుతి చేస్తూ భోగిని జరుపుకున్నారు. సంప్రదాయంలో భాగంగా బాలల శిరస్సులపై వారికి భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, వారి జీవితాల్లో అంతా శుభమే జరగాలని దీవిస్తూ పెద్దలు భోగి పండ్లు (రేగిపండ్లు) పోసి ఆశీర్వచనాలు అందజేస్తారు.



రోడ్డుమార్జిన్‌లో ఏర్పాటు చేసిన దుకాణం వద్ద మహిళల రద్దీ



భోగి మంటకు తాటాకులు కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు




భోగి పండ్లు

సకల శుభాలు కలగాలి



నెల్లూరు (సెంట్రల్): రాష్ట్ర ప్రజలందరూ భోగి, మకర సంక్రాంతి, కనుమ పండగలను ఆనందంగా జరుపుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్రాంతి శుభాకాంక్షలు



జిల్లా ప్రజలకు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలతో జరుపుకునే ఈ పండగతో సుఖసంతోషాలను, మంచి ఆరోగ్యాన్ని అందించాలని కోరారు.

సంతోషాలు నింపాలి



నెల్లూరు(అర్బన్): మకర సంక్రాంతి పండగ జిల్లా ప్రజలకు సుఖః సంతోషాలు కలిగించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగల పర్వదినాలను పురస్కరించుకుని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈవీఎంల గోడౌన్ వద్ద పటిష్ట భద్రత

• కలెక్టర్ చక్రధర్‌బాబు



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు రూరల్: ఈవీఎంల గోడౌన్ వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. నగరంలోని నెల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎంల గోడౌన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. గోడౌన్‌లోని ఈవీఎంలకు సంబంధించి వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎంలను తనిఖీ చేసి నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. గోడౌన్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. కలెక్టర్ వెంట నెల్లూరు ఆర్డీఓ మలోల, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి

• మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

వెంకటాచలం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, వాటిని భావితరాలను అందించే ఉత్తమ మార్గం పండగలు జరుపుకోవడమేనని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సంక్రాంతి సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ పండగలు అంటే కొత్త బట్టలు, పిండి వంటలే కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయడంతోపాటు, పెద్దలు చూపిన మార్గంలో ముందుకు సాగాలన్న స్ఫూర్తిని అందిస్తాయన్నారు. సంక్రాంతి రైతుల పండగని, తెలుగు లోగిళ్లకు సంక్రాంతి తొలి కాంతులను తీసుకువస్తుందని చెప్పారు. మన ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలన్న షేర్ అండ్ కేర్ అనే భారతీయ ధర్మంలోని మూల సూత్రాన్ని ఈ పండగ తెలియజేస్తుందన్నారు. పాతను వదిలి కొత్త మార్గంలో సాగాలనే సందేశాన్ని భోగి, పెద్దలను గౌరవించాలనన్న సందేశాన్ని సంక్రాంతి, ప్రకృతిని, పశు సంపదను కాపాడుకోవాలన్న స్ఫూర్తిని కనుమ పండగలు తెలియజేస్తాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్న స్ఫూర్తి భారత రాజ్యాంగంలోనూ కనపడుతుందన్నారు. మహాభారతం, రామాయణం, అశోకుడు, గౌతమబుద్ధుడు జీవితాలను ప్రతిబింబిస్తూ రాజ్యాంగంలోని మొదటి పేజీల్లో కనిపించే చిత్రాలు కర్తవ్య పరాయణత్వం , సేవాభావం, మానవత్వం, జ్ఞానం, ధర్మపరాయణత్వం , వంటి భారతీయ జీవన విలువల్ని ప్రతిబింబిస్తాయన్నారు. ఐశ్వర్యం అంటే సంపద కాదని, సేవలోనే నిజమైన ఐశ్వర్యం దాగి ఉందన్నారు. సంక్రాంతి అందరి జీవితాల్లో నవ్యకాంతులు తీసుకురావాలని, వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత దేశ వృద్ధి పథంలో అందరూ భాగస్వాములవ్వాలని ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉన్నత స్థాయికి ఎదిగినా, నిరంతరం ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడే వ్యక్తి వెంకయ్యనాయుడు అని కొనియాడారు. సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు ఆస్తులుగా అందించాలనే ప్రయత్నం చాలా గొప్పదన్నారు. మానవ సంబంధాలు నానాటికీ క్షీణించిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇటువంటి పండగ సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆవశ్యమన్నారు. మనస్సుకు విశ్రాంతి, ప్రశాంతత కలగాలంటే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏడాది స్వర్ణభారత్ ట్రస్ట్‌లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ మన సంస్కృతి, సంప్రదాయాలను, సంక్రాంతి పండగ విశిష్టతను వివరించారు. సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, కలెక్టర్ చక్రధర్‌బాబు, వెంకయ్యనాయుడు సతీమణి ముప్పవరపు ఉషమ్మ, డీఆర్‌డీఏ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిపై విద్యుత్ చౌర్యం కేసు

• రూ.1,07,629 జరిమానా
• పంటపాళెంలో విద్యుత్ అధికారుల తనిఖీలు



పల్లంరెడ్డి రామమోహన్‌రెడ్డి

నెల్లూరు, సాక్షి ప్రతినిధి: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముత్తుకూరు మండలం పంటపాళెం గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు పల్లంరెడ్డి రామమోహన్‌రెడ్డిని శుక్రవారం ఉదయం రెడ్ హ్యాండెడ్‌గా విద్యుత్ అధికారులు పట్టుకొన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రూ.1,07,629 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీఈ (డీపీఈ-2) డీ వెంకటరామిరెడ్డి, ముత్తుకూరు ఏఈ టీవీ రామప్రసాద్‌రెడ్డి పంటపాళెంలో తనిఖీలు నిర్వహించారు. పల్లంరెడ్డి రామమోహన్‌రెడ్డి కొంత కాలంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడడాన్ని ప్రత్యక్షంగా గుర్తించారు. పంటపాళెం ప్రజల గృహావసరాలకు (నీటి అవసరాలకు) వినియోగించే విద్యుత్‌ను అక్రమంగా చోరీ చేసినట్లు నిర్ధారించారు. సొంత విద్యుత్ మీటరు ఉన్నప్పటికీ దీనిని వినియోగించకుండా, పంచాయతీకి చెందిన (24 గంటల విద్యుత్) హెచ్‌ఎస్‌సీ 829 నంబరు ఎల్‌టీ విద్యుత్ మీటర్ నుంచి విద్యుత్‌ను చౌర్యం చేస్తూ, ఇంటి నిర్మాణానికి, ట్యాంకర్ల ద్వారా నీటి అమ్మకాలకు వినియోగిస్తున్నట్లు పక్కాగా గుర్తించారు. రెండు నలుపు రంగు పీవీసీ అల్యూమినియమ్ తీగలతో తయారు చేసిన దోట్లు అమర్చి మరీ చౌర్యానికి పాల్పడడం విద్యుత్ అధికారులను విస్మయానికి గురి చేసింది. తనిఖీ సమయంలో 1492 వాట్స్ విద్యుత్ చౌర్యానికి గుర్తించి రూ.1,07,629 గుర్తించి, రామమోహన్‌రెడ్డికి జరిమానా విధించారు. చౌర్యానికి పాల్పడ్డ పరికరాలు, సామగ్రిని స్వాధీనం చేసుకొని, ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన పంటపాళెంలోనే కాకుండా మండలంలో కలకలం సృష్టించింది.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC — APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను
సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 98489 97210
గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ప్రైవేట్ వైద్యశాలల్లో ఎవరైనా స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య హెచ్చరించారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచామన్నారు. వైద్యశాఖ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ఈ సమయంలో ఎక్కడైనా లింగ నిర్ధారణ జరిగినట్టు తేలితే సెంటర్లను సీజ్ చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ లింగ నిష్పత్తి పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్లు గీతాలక్ష్మి, చందన్‌రెడ్డి, నెల్లూరు డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దయాకర్, లీగల్ కన్సల్టెంట్ రూప, ఎన్‌జీఓ ప్రతినిధులు కవితారెడ్డి, శ్రీనివాసరావు, కుసుమకుమారి, డెమో అధికారి శ్రీనివాసరావు, హెచ్‌ఈఓ నరసింహారావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

కావ్యశ్రీకి

అంతర్జాతీయ యోగం

అనారోగ్యం ఆమెను యోగాకు దగ్గర చేసింది. సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాదు.. అంతర్జాతీయ స్థాయిలో యోగా పోటీల్లో ప్రతిభ చాటి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఆమే నెల్లూరుకు చెందిన గుంజి కావ్యశ్రీ. పలువురు మహిళలకు యోగా నేర్పుతూ స్ఫూర్తి నింపుతోంది.

- 2008లో అనారోగ్య సమస్యలు
- కోలుకునేందుకు యోగా సాధన
- అనేక పోటీల్లో విజయంతో గుర్తింపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని అయ్యప్పగుడి సమీపంలో నివాసం ఉండే కావ్యశ్రీకి వివాహమైంది. భర్త కృష్ణమూర్తి వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వారికి ఒక కుమార్తె, కుమారుడు సంతానం. 2008లో కావ్యశ్రీకి తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురయ్యాయి. వైద్యుల సలహా మేరకు ఆమె యోగా సాధన ప్రారంభించింది. ఈక్రమంలో గురువులు పెంచలయ్య, చంద్రశేఖర్, రవీంద్ర వద్ద మెలకువలు నేర్చుకుంది. తర్వాత ఇంట్లోనే సొంతంగా సాధన చేయడం మొదలుపెట్టింది. కఠినమైన విన్యాసాలు నేర్చుకోవడంతో యోగాపై పూర్తి పట్టు సాధించింది.

పోటీల్లో రాణిస్తూ..

2016 సంవత్సరం నుంచి కావ్యశ్రీ యోగా పోటీల్లో పాల్గొనడం ప్రారంభించింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించింది. మూడుసార్లు ప్రథమ స్థానాలను సాధించింది. ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో 35 నుంచి 45 సంవత్సరాల మహిళల విభాగంలో తొలి స్థానంలో నిలిచింది. పది దేశాల నుంచి 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో కావ్యశ్రీ ప్రతిభ చాటింది. భవిష్యత్‌లోనూ అనేక పోటీల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు తయారు చేసుకుంటోంది. ఇంకా ఆమె తన ఇంట్లోనే ఫిట్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి మహిళలకు మాత్రమే యోగా నేర్పుతోంది. ఆరోగ్యంగా ఉండడంతోపాటు పోటీల్లో రాణించేలా వారిని తీర్చిదిద్దుతోంది. గృహిణి యోగా క్రీడాకారిణిగా మారిన వైనం స్ఫూర్తిగా నిలుస్తోంది.



పాండిచ్చేరిలో అవార్డు అందుకుంటూ.. (ఫైల్)

భర్త ప్రోత్సాహంతోనే..

"ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగాను ఆశ్రయించాను. ఆరోగ్యం కుదుటపడింది. 13 సంవత్సరాలుగా ఒక్క టాబ్లెట్ కూడా వేసుకోలేదు. కరోనా సమయంలో కూడా పలువురికి యోగా నేర్పించాను. యోగా పోటీల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగడంలో నా భర్త, పిల్లలు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేను.

– కావ్యశ్రీ







యోగా సాధన చేస్తున్న కావ్యశ్రీ

పొదలకూరు నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	రూ.27
సన్నవి	రూ.18
పండ్లు	రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు	
బ్రాయిలర్ (లైవ్)	125
లేయర్ (లైవ్)	95
బ్రాయిలర్ చికెన్	220
బ్రాయిలర్ స్కిన్‌లెస్	242
లేయర్ చికెన్	162

క్లుప్తంగా

సెల్‌ఫోన్ కొనివ్వలేదని బాలుడి ఆత్మహత్య

బిట్రగుంట: తండ్రి ఖరీదైన సెల్‌ఫోన్ కొనివ్వలేదని కొడుకు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కోవూరుపల్లి గిరిజన కాలనీకి చెందిన పోట్లూరి శీనయ్య స్థానికంగా వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి సంతోష్ (16) అనే కుమారుడు ఉన్నాడు. కొద్దిరోజుల నుంచి కొడుకు రూ.25 వేల విలువచేసే స్మార్ట్ ఫోన్ కొనివ్వాలని తండ్రిని అడుగుతున్నాడు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో డబ్బు లేదని కుమారుడికి చెప్పి కొద్దిరోజులు ఆగమన్నారు. దీంతో తల్లిదండ్రులపైన అలిగిన సంతోష్ రెండురోజుల నుంచి ముభావంగా ఉంటూ గురువారం సాయంత్రం పొలంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే అతడిని నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బిట్రగుంట ఎస్సై చినబలరామయ్య తెలిపారు.

కర్ణాటక మద్యం బాటిళ్ల స్వాధీనం

- ఒకరిని అరెస్ట్ చేసిన సెబ్ అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కందుకూరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశామని సెబ్ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కొండముడుసుపాళెం గ్రామానికి చెందిన ముప్పా రవితేజ అనే యువకుడు కొంతకాలంగా కర్ణాటక నుంచి గుట్టుచప్పుడు కాకుండా మద్యం బాటిళ్లు తెచ్చి గ్రామంలో నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో సమాచారం అందుకున్న సెబ్ అధికారులు గురువారం రాత్రి కొండముడుసుపాళెంలో దాడులు నిర్వహించి రవితేజను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతడి నుంచి రూ.1.40 లక్షల విలువైన 11 రకాల బ్రాండ్లకు చెందిన 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలో గంజాయి విక్రయాలపై కూడా నిఘా ఉంచామని సీఐ తెలిపారు. సమావేశంలో సెబ్ ఎస్సై మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

చంపి.. పరుపులో చుట్టి..

- అద్దెకున్న వ్యక్తి మద్యం తాగి అరుపులు
- ప్రశ్నించినందుకు ఇంటి యజమాని హత్య



ఓబులేసు (ఫైల్)



పరుపులో చుట్టి..

బుచ్చిరెడ్డిపాళెం: ఓ వ్యక్తి రోజూ మద్యం తాగి రాత్రి వేళ అరుస్తున్నాడు. ఎందుకిలా చేస్తున్నావని ప్రశ్నించిన ఇంటి యజమానిని అతను హత్య చేశాడు. ఈ ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని చాకలివీధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చాకలివీధిలో ఓబులేసు అనే వ్యక్తి తన భార్య సుబ్బమ్మతో కలిసి ఇంటి పైఅంతస్తులో ఉంటున్నాడు. కింద ఉన్న రెండు గదులను ఇద్దరు వ్యక్తులకు బాడుగకు ఇచ్చాడు. ఓ గదిలో ఉంటున్న రాజశేఖర్ మద్యానికి బానిసయ్యాడు. అతను నిత్యం రాత్రి వేళ తాగి ఇంటికొచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఇది పద్ధతి కాదని అతడిని ఓబులేసు పలుమార్లు మందలించాడు. అయినా మారలేదు. మద్యం మానేస్తేనే ఇంటికొస్తానని రాజశేఖర్‌కు చెప్పి భార్య స్వగ్రామానికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో అతను మద్యం తాగడం మరింత ఎక్కువైంది. వేకువజాము వరకు పెద్దపెద్దగా కేకలు వేసేవాడు. శుక్రవారం మూడు గంటల సమయంలో మద్యం మత్తులో అతను పెద్దగా కేకలు వేస్తుండగా ఓబులేసు తన భార్యకు చెప్పకుండా కిందకొచ్చాడు. రాజశేఖర్ వద్దకు వెళ్లి ఎందుకిలా చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. నన్నే ప్రశ్నిస్తావా అంటూ రాజశేఖర్ కర్రతో ఇంటి యజమాని తలపై బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని రాజశేఖర్ తన గదిలో ఉన్న పరుపులో చుట్టి పైన దుప్పట్లు కప్పి బయటకు వచ్చాడు. ఇంతలో పక్కన మరో గదిలో బాడుగకు ఉంటున్న వారు వచ్చి ఎందుకు అరుస్తున్నావు?, లైట్లెందుకు ఆర్పేశావని ప్రశ్నించారు. తాను ఎక్కువగా మద్యం తాగానని, భార్య వద్దకు వెళ్తున్నానని, అందుకు లైట్లు ఆర్పేశానని చెప్పి గదికి తాళాలు వేసి వారికిచ్చి వెళ్లిపోయాడు. తెల్లవారాక ఓబులేసు కనిపించకపోవడంతో భార్య కిందకు వచ్చి అద్దెకున్న వారిని అడిగింది. రాజశేఖర్ పెద్దగా కేకలు వేశాడని, అలాగే గది తాళాలు తమకిచ్చి వెళ్లాడని చెప్పడంతో ఆమెకు అనుమానం కలిగింది. వెంటనే గది తలుపు తెరిచి లోపలికి వెళ్లి వెతికారు. దుప్పట్లను తొలగించి పరుపును తెరవగా అందులో ఓబులేసు విగతజీవిగా కనిపించడంతో సుబ్బమ్మ కన్నీరుమున్నీరుగా విలపించింది. సమాచారం అందుకున్న సీఐ కోటేశ్వరావు, ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదాయ పన్ను చెల్లింపులో డీడీఓలదే బాధ్యత

- ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీనివాస్



హాజరైన అధికారులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఆదాయ పన్ను చెల్లింపులో ఆయా శాఖల డీడీఓలదే పూర్తి బాధ్యతని ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విజయవాడ నుంచి నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ డీడీఓలు ఉద్యోగుల ఆదాయ పన్ను వివరాలను పరిశీలిస్తూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిబ్రవరి నెల లో ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లులను అప్‌లోడ్ చేయాలన్నారు. గత సంవత్సరం లానే ఈ సంవత్సరం కూడా ఆదాయం పన్ను చెల్లింపునకు సంబంధించి పాత విధానం, కొత్త విధానం రెండూ అమల్లో ఉన్నాయన్నారు. ఉద్యోగులు వారికి లాభదాయకమైన విధానంలో పన్ను చెల్లించాలన్నారు. వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి, ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఉద్యోగి నిబంధనలకనుగుణంగా పన్ను చెల్లించాలన్నారు. అనంతరం ఉద్యోగులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఆదాయ పన్ను శాఖ అధికారి రాజశేఖర్, జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ గంగాధర్, ఏటీఓ లోకేష్‌బాబు, ఎస్టీఓ రహమాన్, డీడీఓలు, ఉద్యోగులు హాజరయ్యారు.

ఇంటికెళ్తుండగా ప్రమాదం

- రాత్రి వేళ కావడంతో ఎవరూ గుర్తించని వైనం
- ఉదయం ఆస్పత్రికి తరలింపు
- మృతిచెందినట్లు డాక్టర్ల నిర్ధారణ



సుధాకర్ మృతదేహం

వింజమూరు: ఓ వ్యక్తి రాత్రి వేళ ఇంటికెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఉదయం వరకూ అతడిని ఎవరూ గుర్తించలేదు. తర్వాత ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని నందిగుంటకు చెందిన వీఆర్ఏ బ్రహ్మయ్యకు మీసాల సుధాకర్ (28) అనే కుమారుడు ఉన్నాడు. గురువారం రాత్రి సుధాకర్ మోటార్ బైక్‌పై దుత్తలూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. కావలి – ఉదయగిరి రోడ్డులో వింజమూరు మండలం ఊటుకూరు సమీపంలో బ్రిడ్జి నిర్మాణంలో ఉంది. ఈ విషయం తెలియని సుధాకర్ బ్రిడ్జికి డైవర్షన్ రోడ్డుకు మధ్యలో వెళ్లగా కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. తలకు దెబ్బతగిలి స్పృహ కోల్పోయాడు. శుక్రవారం ఉదయం వరకు అతడిని ఎవరూ గుర్తించలేదు. తర్వాత అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది, ఎస్సై జంపాని కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

కనులపండువగా కల్యాణోత్సవం



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జునస్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రీగంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అమ్మవార్లకు కుంకుమాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు తరలి వచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

రీ సర్వేను పక్కాగా నిర్వహించండి



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా జరిగే భూముల రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ అధికారులకు సూచించారు. మండలంలోని చౌకచెర్ల, పార్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా నిజమైన భూ హక్కుదారులకు న్యాయం జరుగుతుందన్నారు. గత 100 సంవత్సరాల నుంచి సర్వే జరగకపోవడంతో గ్రామస్థాయిలో భూసమస్యలు ఏర్పాడ్డాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

నేటి నుంచి షటిల్ పోటీలు ప్రారంభం

కోవూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న షటిల్ కోర్టులో ఈ నెల 14వ తేదీ నుంచి మూడు రోజులపాటు పెద్ది ప్రభావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.నవీన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు కోవూరు, కొడవలూరు, విడవలూరు మండలాల స్థాయిలో జరుగుతాయని తెలిపారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపిక అందజేస్తామని తెలిపారు. వివరాలకు 80194 80480, 99663 66179, 90147 36166 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నేటి నుంచి జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు

తోటపల్లిగూడూరు: మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో శనివారం నుంచి రెండు రోజులపాటు జిల్లాస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తిరవళ్లూరు ఈశ్వరయ్య, కదురు వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆల్తూరి ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్‌ల అధినేతలు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆల్తూరి మహేష్‌రెడ్డి సంయుక్తంగా ఈ చెడుగుడు పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన పురుషులు, మహిళల జట్లకు నగదు బహుమతులు అందజేయడంతోపాటు అత్యుత్తమ క్రీడా ప్రదర్శన చూపిన క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన సదుపాయంతోపాటు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9440981992, 9704682519 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

పంట నమోదుపై ఆసక్తి చూపాలి

కొడవలూరు: పంట నమోదుపై రైతులు ఆసక్తి చూపాలని ఏఓ సీహెచ్ లక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదుపై రైతులు ఆసక్తి చూపనందున నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు. పంట నమోదు ఆవశ్యకతపై రైతుల్లో అవగాహన లేకపోవడం వల్లే ఆసక్తి చూపడం లేదన్నారు. సలహా మండలి సభ్యులు చొరవ చూపి రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ప్రతి రైతు నమోదు చేయించుకోవడంతోపాటు ఈ కేవైసీ చేయించుకొనేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో సలహా మండలి సభ్యుడు కాకి శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూరల్ పరిధిలోని 26వ డివిజన్లో గల విక్రమ్‌నగర్‌లో ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక సమస్యలతో పాటు పథకాల అమలు తీరును ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. అర్హులై పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామని వివరించారు. కార్పొరేటర్ సుప్రజ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పురుషోత్తమ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

మార్చి 26 నుంచి ఇరుకళల పరమేశ్వరి జాతర

నెల్లూరు రూరల్: సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి జాతరను మార్చి 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో వేద పండితులు, దేవదాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల అనంతరం జాతరను మరోసారి నిర్వహించనుండటం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే పెద్ద వేడుకగా జాతరను నిర్వహించాలని భావిస్తున్నామని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అనంతరం వేదపండితుల సూచనలు, సలహాలను తెలుసుకున్నారు. రాజరాజేశ్వరి దేవస్థాన ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నిబంధనల మేరకే ప్రకటన బోర్డుల ఏర్పాటు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ నిబంధనల మేరకే ప్రకటన బోర్డులను ఏర్పాటు చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రకటన బోర్డులకు సంబంధించిన పన్నులను వేగవంతంగా వసూలు చేయాలని సూచించారు. భారీ హోర్డింగ్‌ల ఏర్పాటు సమయంలో నాణ్యత ప్రమాణాలను యాడ్ ఏజెన్సీలు పాటించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కోర్టు కేసుల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు.



మాట్లాడుతున్న హరిత

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు.

రంగనాథుడి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథుడ్ని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు వారిని సాదరంగా ఆహ్వానించారు. తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

నేత్రపర్వంగా భోగి తోట ఉత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కొలువైన ఆండాళ్ అమ్మవారి భోగి తోట ఉత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేక పల్లకిపై అమ్మవారిని కొలువుదీర్చి నవాబుపేటలోని బుజ్జమ్మతోట వరకు ఉత్సవాన్ని జరిపారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

నెల్లూరు(బారకాసు): సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలోని రాజేంద్రనగర్‌లో రంగవల్లుల పోటీలను బీజేవైఎం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన శాంతి, హైమావతి, ఉమాకు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి స్టీల్ బాక్సులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు విజయలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్, ఆరెస్సెస్ నేత శ్రీకాంత్, బీజేవైఎం నేతలు కార్తీక్, సాయికుమార్, కృష్ణ, మణి, తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాప్టో నేతల ధర్నా

నెల్లూరు (టౌన్): బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటును మాత్రమే చేపట్టాలని ఫ్యాప్టో నేతలు కోరారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎదుట ధర్నాను శుక్రవారం చేపట్టారు. అనంతరం ఏడీ గ్లోరీకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, రాష్ట్ర పరిశీలకుడు రమణయ్య, కో చైర్మన్లు మురళీకృష్ణ, హమీద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ శేషు, హజరత్, కార్యదర్శి చలపతి, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): సంక్రాంతిని పురస్కరించుకొని మహిళలకు చీరలు, పేదలకు దుప్పట్లు, మిఠాయిలను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. సుబేదారుపేటలోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(లీగల్): అంబేడ్కర్ ఆలోచన ఆంధ్రప్రదేశ్ కమిటీ క్యాలెండర్లను నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో గల బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ట్రెజరర్ రమేష్, లైబ్రరీ సెక్రటరీ ప్రసాద్, ఏఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు పద్మాకర్, కార్యదర్శి వెంకయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు





కార్పొరేషన్ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం నిర్వహించారు. మేయర్ స్రవంతి, కమిషనర్ హరిత సిబ్బందితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి మంటలను వేసి.. పతంగులను ఎగురవేశారు. కోలాట ప్రదర్శనను నిర్వహించారు. నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను వారు తెలియజేశారు. – నెల్లూరు సిటీ



కళాత్మక శుభాకాంక్షలు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన వృత్తి నైపుణ్యంతో సంక్రాంతికి కళాత్మకంగా శుభాకాంక్షలను తెలియజేశారు. బొమ్మలు, కలప ముక్కలు, దూది, పాలకుండ, తదితర సామగ్రిని ఉపయోగించి పండగ శోభకు రూపమిచ్చారు.



సుఖసంతోషాలతో సంక్రాంతిని జరుపుకోవాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ శుక్రవారం తెలియజేశారు. సుఖసంతోషాలతో పండగను జరుపుకోవాలని కాంక్షించారు.



తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌గా బాలకృష్ణ

నెల్లూరు సిటీ: కమిషనర్ పీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ బాలకృష్ణను ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను శుక్రవారం జారీ చేసింది. రెవెన్యూ ఆఫీసర్‌గా, ఢిల్లీరావు కమిషనర్‌గా ఉన్న సమయంలో సీసీగా ఆయన గతంలో విధులు నిర్వర్తించారు.



విద్యుత్ ప్రమాదాలను నివారించండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ప్రమాదాలను నివారించేలా తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య కోరారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాద రహిత సంవత్సరంగా మార్చాలని, ఐఎస్ఐ నాణ్యత కలిగిన విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, తదితర పరికరాలను వినియోగించాలని కోరారు. కొబ్బరి, పామాయిల్ లాంటి తోటల్లో కొమ్మలను తొలగించే సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం మెయింటెనెన్స్ డే అయినా, పండగ సందర్భంగా ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. అనంతరం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలియజేశారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ఎయిర్‌ఫోర్స్‌లో పోస్టులకు నోటిఫికేషన్

నెల్లూరు(మినీబైపాస్): అగ్నిపథ్‌లో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు (మెడికల్ అసిస్టెంట్) గ్రూప్ – వై కేటగిరీలో ఉద్యోగాల ఎంపికకు నోటిఫికేషన్‌ను కమాండింగ్ ఆఫీసర్, రిక్రూటింగ్ ఆఫీస్, సికింద్రాబాద్ వారు విడుదల చేశారని సెట్నెల్ సీఈఓ పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీలో 50 శాతం లేదా ఫార్మసీలో డిప్లొమా లేదా డిగ్రీలో ఉత్తీర్ణులైన యువకులు అర్హులని తెలిపారు. 27 జూన్, 1999 నుంచి 27 జూన్ 2004 మధ్య జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 4, 5వ తేదీలు, ఫార్మసీ డిప్లొమా లేదా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి ఏడు, ఎనిమిదో తేదీల్లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, తాంబరం, చెన్నైలో ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌కు హాజరుకావాలని కోరారు. ఆసక్తి గల వారు agnipathvayu.cdac.inలో నోటిఫికేషన్‌ను పరిశీలించాలని కోరారు. వివరాలకు 93453 77868 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సుకన్య సమృద్ధి యోజనతో భరోసా

• పథకంలో రూ.10 లక్షల నుంచి రూ.65 లక్షల వరకు పొందవచ్చు
• నెల్లూరు డివిజన్లో ఇప్పటి వరకు 43,756 మంది నమోదు

నెల్లూరు(మినీబైపాస్): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన సుకన్య సమృద్ధి యోజనతో భరోసా లభిస్తోంది. బాలికకు పదేళ్లలోపు వయస్సు ఉంటే ఈ పథకంలో ఖాతాను ప్రారంభించొచ్చు. కేవలం రూ.250తో కొన్ని బ్యాంకులు లేదా పోస్టాఫీస్‌కు వెళ్లి ఖాతాను ప్రారంభించే వెసులుబాటు ఉంది. నెల్లూరు డివిజన్లో ఇప్పటి వరకు సుకన్య సమృద్ధి యోజనను 43,756 మంది వినియోగించుకుంటున్నారు.

ఇవీ ఉపయోగాలు..

• నెలకు రూ.250 నుంచి డిపాజిట్ చేసుకోవచ్చు. నెలకు రూ.వెయ్యి చొప్పున డిపాజిట్ చేస్తే రూ.ఆరు లక్షలు పొందవచ్చు. గరిష్టంగా నెలకు రూ.12,500 వరకు పెట్టుబడిగా పెట్టొచ్చు. ప్రస్తుతం ఈ స్కీమ్‌లో 7.6 శాతం వడ్డీ లభిస్తోంది. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ – 80సీ కింద పన్ను ప్రయోజనాలను సైతం పొందే అవకాశం ఉంది. స్కీమ్‌పై లభిస్తున్న వడ్డీ రేటు ప్రతి మూడు నెల్లకోసారి మారుతూ ఉంటుంది.

• పదేళ్లలోపు ఉన్న ఇద్దరు కుమార్తెల పేరుపై సుకన్య సమృద్ధి యోజన అకౌంట్లను ప్రారంభించొచ్చు. దత్తత తీసుకున్నా, ఖాతాను ప్రారంభించే అవకాశం ఉంది. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు అకౌంట్‌లో డిపాజిట్ చేయొచ్చు. కనీసం రూ.250 మేర డిపాజిట్ చేయాలి. నెలకు రూ.వెయ్యి నుంచి రూ.12 వేల వరకు కట్టుకుంటే మెచ్యూరిటీ తర్వాత నగదును పొందవచ్చు. ఖాతాను ప్రారంభించిన నాటి నుంచి సగటున 15 ఏళ్ల పాటు నగదును జమ చేయాల్సి ఉంటుంది.

• బాలికకు 18 ఏళ్లు వచ్చాక 50 శాతం నగదును వెనక్కి తీసుకోవచ్చు. 21 ఏళ్లు వచ్చాక మొత్తం నగదును విత్‌డ్రా చేసుకోవచ్చు. ఉన్నత చదువు, వివాహానికి ఈ నగదును ఉపయోగించుకోవచ్చు. పాప బర్త్ సర్టిఫికెట్, ఫొటోలు, తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఐడీ, అడ్రస్ ప్రూఫ్, తదితర డాక్యుమెంట్లు అవసరమవుతాయి.

• నెట్ బ్యాంకింగ్ సాయంతో నగదును ఖాతాకు బదిలీ చేసుకునే అవకాశం ఉంది. సుకన్య సమృద్ధి అకౌంట్‌లో బ్యాలెన్స్ ఎంత ఉందో సైతం ఆన్‌లైన్లో తెలుసుకోచ్చు.



ఏకేనగర్‌లోని తపాలా కార్యాలయం

అద్భుతమైన పథకం:



సుకన్య సమృద్ధి యోజన బాలికలకు ఓ వరం లాంటిది. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటి వరకు 43,756 మంది ఈ పథకానికి నమోదు చేసుకున్నారు.

– రామకృష్ణ, తపాలా శాఖ సూపరింటెండెంట్

యువతకు క్రీడలు అవసరం

పొదలకూరు: యువతకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతాయని పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంగమేశ్వరరావు అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణానికి సమీపంలో సంగం రోడ్డు మైదానంలో శుక్రవారం ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో ఆర్గనైజర్ ఎం.రవికుమార్‌యాదవ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు గత 15 ఏళ్లుగా ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్గనైజర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతుల అందజేస్తామని, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ ఆల్‌రౌండర్‌లకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే కరిముల్లా, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు పి.బాలకృష్ణ, మనోహర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి **బిజినెస్**
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
303	98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్డాక్	10,978 ▽	23
డోజోన్స్	34,193 ▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,844 ▲	50
డాక్స్	15,087 ▲	28
షాంఘై	3,195 ▲	31
నికాయ్	26,120 ▽	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
56,462 ▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)	
56,236 ▲	351
వెండి (కిలో)	
68,115 ▲	90

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకదానికి	79.50	83.18
£	బ్రిటన్ పౌండ్	ఒకదానికి	96.84	101.69
€	యూరో	ఒకదానికి	85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)	ఒకదానికి	50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకదానికి	54.20	59.09
S$	సింగపూర్ డాలర్	ఒకదానికి	59.21	63.76
SAR	సౌదీ రియాల్	ఒకదానికి	20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకదానికి	21.25	23.04
¥	చైనా యువాన్	ఒకదానికి	10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్



ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్ల దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్‌ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.

స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తృతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.

ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం



న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.

పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి **స్పోర్ట్స్**



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్



మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.

భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.


అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదోసారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన


సూర్య, ఇషాన్

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరో వైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.

న్యూజిలాండ్‌దే సిరీస్

కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు


భరత్

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం


హిమ్మత్

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.